సాక్షి
కామారెడ్డి
గురువారం । 31 । జూలై । 2025



తాళం వేసిన ఇళ్లే టార్గెట్
మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మద్నూర్ మండలంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.
- 9లో ▸



భర్త హత్యకు సుపారీ..
వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను చంపించడానికి సుపారీ ఇచ్చిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /22.1
వాతావరణం
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'



కామారెడ్డి క్రైం : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ అభియాన్ రాష్ట్ర ఇన్‌చార్జి సుభాష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. నిరంతరం శ్రమిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీరాజాగౌడ్, పంచాయతీ రాజ్ అభియాన్ జిల్లా అధ్యక్షుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపిక




కామారెడ్డి అర్బన్/మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేటకు చెందిన తగిరంచ శ్రావ్య హాకీ జూనియర్ ఉమెన్స్ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ విషయాన్ని హాకీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు నీలం, వెంకట్, మధుసూదన్‌రెడ్డి, కోచ్ అంజనేయులు వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. నేషనల్ క్యాంప్‌లో ఉత్తమ ప్రతిభ చూపడంతో ఆమెను హాకీ జూనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో నిర్వహించే నేషనల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

'విద్యార్థులను తీర్చిదిద్దాలి'



తాడ్వాయి: విద్యార్థులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. ఆయన బుధవారం తాడ్వాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠం బోధించి ప్రశ్నలను అడిగారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్వేత, ఎంఈవో రామస్వామి, హెచ్‌ఎం కల్యాణి, ఆర్‌ఐ హారిక తదితరులున్నారు.

'డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి'



భిక్కనూరు: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు అంధకారం అవుతాయని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. బుధవారం జంగంపల్లి గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 కు, షీటీమ్స్ నంబర్ 87126 86094, భరోసా టోల్‌ఫ్రీ నంబర్ 1098లకు, సైబర్ నేరాలపై టోల్‌ఫ్రీ నంబర్ 1930 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత, భిక్కనూరు సీఐ సంపత్‌రెడ్డి, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి రామంచ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటులో కోతలే!

- 80 శాతం సిజేరియన్లే..
- సర్కారులోనూ సగమే నార్మల్ డెలివరీలు
- ఎవరికీ పట్టని అమ్మ వేదన

సుఖ ప్రసవానికి వీలు లేనప్పుడు, కడుపులో బిడ్డ సరిగా ఎదగనప్పుడు, ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే సిజేరియన్లు చేయాలి. కానీ ప్రైవేటు ఆస్పత్రులలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా సిజేరియన్లు చేసేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గణాంకాలు సైతం దీనికి రుజువుగా నిలుస్తున్నాయి. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



అమ్మతనం అపురూపమైన అవకాశం. బిడ్డను కనడానికి మహిళలు ఆరాటపడతారు. తొమ్మిది నెలల పాటు కడుపులో బిడ్డను మోసి డెలివరీ కోసం ఆస్పత్రులకు వెళ్తున్న గర్భిణులకు వైద్యులు ఏదో కారణం చెప్పి సిజేరియన్ చేసేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో అడుగు పెడితే చాలు కోయడమే అన్నట్టుగా తయారైంది. ప్రైవేటులో దాదాపు 80 శాతం సిజేరియన్లే జరుగుతుండడం గమనార్హం. ఐదేళ్ల కాలంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో 21,433 కాన్పులు జరిగితే అందులో 18,133 కాన్పులు సిజేరియన్లే ఉన్నాయి. 3,300 మాత్రమే సాధారణ కాన్పులు కావడం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 41,175 కాన్పులు జరిగితే 20,692 సాధారణం కాగా.. 20,488 సిజేరియన్లు ఉన్నాయి.

ఆ ప్రాంతంలో నార్మల్ డెలివరీలే అధికం..

మారుమూలన ఉన్న జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, పెద్దకొడప్‌గల్, డోంగ్లీ, పుల్కల్ పీహెచ్‌సీలతో పాటు పిట్లం, మద్నూర్, బిచ్కుంద సీహెచ్‌సీల పరిధిలో సాధారణ కాన్పులే ఎక్కువగా జరుగుతాయి. 2022–23 సంవత్సరంలో జుక్కల్‌లో 528 సాధారణ కాన్పులు, 146 సిజేరియన్లు జరిగాయి. పెద్దకొడప్‌గల్‌లో 235 సాధారణం, 104 సిజేరియన్లు, డోంగ్లీలో 398 సాధారణం, 183 సిజేరియన్లు నమోదయ్యాయి. పుల్కల్‌లో 187 సాధారణం, 138 సిజేరియన్లు జరిగాయి.

2023–24 సంవత్సరంలో జుక్కల్‌లో 510 సాధారణం, 190 సిజేరియన్లు, డోంగ్లీలో 470 సాధారణం, 202 సిజేరియన్లు, పుల్కల్‌లో 235 సాధారణం, 145 సిజేరియన్లు, పెద్దకొడప్‌గల్‌లో 231 సాధారణం, 123 సిజేరియన్లు జరిగాయి. 2024–25లో జుక్కల్‌లో 476 సాధారణం, 154 సిజేరియన్లు, డోంగ్లీలో 475 సాధారణం, 216 సిజేరియన్లు, పుల్కల్‌లో 197 సాధారణం, 164 సిజేరియన్లు, పెద్దకొడప్‌గల్‌లో 202 సాధారణం, 119 సిజేరియన్లు జరిగాయి.

ఇష్టారాజ్యంగా..

కొందరు వైద్యులు కాసుల కక్కుర్తితో సిజేరియన్ చేసేస్తున్నారు. అవసరం లేకున్నా కడుపు కోసేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఉచితంగా జరగడంతో పాటు అప్పట్లో కేసీఆర్ కిట్, ప్రోత్సాహకాలు అందించడంతో చాలామంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలకు మొగ్గు చూపారు. కొందరు మాత్రమే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో తమ దగ్గరకు వచ్చిన వారిలో ఎక్కువ మందికి సిజేరియన్ చేసేశారు. ఉమ్మనీరు తక్కువగా ఉందనో.. బిడ్డ అడ్డం తిరిగిందనో.. పురిటి నొప్పుల బాధ భరించలేరనో సాకులు చెబుతూ సిజేరియన్లు చేస్తున్నారు. కాగా సిజేరియన్లు తల్లి, బిడ్డల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వైద్యులే చెబుతున్నారు. మొదటి కాన్పు సిజేరియన్ జరిగితే రెండో కాన్పు కూడా సిజేరియన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రసవం తర్వాత తరచూ కడుపునొప్పితోపాటు గర్భసంచికి అనేక రకాల సమస్యలు వస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

వారే ఆదర్శం..

జుక్కల్ ప్రాంతంలో చాలావరకు సాధారణ కాన్పులే జరుగుతాయి. వాళ్లు పురిటి నొప్పులు భరిస్తారు తప్ప సిజేరియన్ వద్దంటారు. కొన్ని గ్రామాల్లోనైతే అసలు సిజేరియన్ అంటే చాలు దూరం జరుగుతారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సాధారణ ప్రసవాలే జరగాలని అక్కడి ప్రజల్లో బలమైన అభిప్రాయం ఉంది. అక్కడ జరిగే సిజేరియన్లలో చాలా వరకు ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకునేందుకు సిజేరియన్ చేయించి దాంతో పాటే ఫ్యామిలీ ప్లానింగ్ చేస్తున్నారని చెబుతున్నారు. వారిని మిగతా ప్రాంతాల ప్రజలు ఆదర్శంగా తీసుకుంటే సిజేరియన్ల బాధ తప్పుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో కాన్పుల వివరాలు..

సంవత్సరం	ప్రభుత్వ ఆస్పత్రులు (నార్మల్	సిజేరియన్)	ప్రైవేట్ ఆస్పత్రులు (నార్మల్	సిజేరియన్)	మొత్తం డెలివరీలు
2021–22	4,747	4,808	878	4,951	15,384
2022–23	5,358	5,305	798	3,924	15,385
2023–24	5,355	4,879	713	3,966	14,913
2024–25	4,321	4,517	745	4,345	13,928
2025–26	911	974	166	947	2,998
మొత్తం	20,692	20,483	3300	18,133	62,608

సింగితంకు మరమ్మతులేవి?



రిటెయినింగ్ వాల్ దెబ్బతిన్న, బుంగ ఉన్న ప్రాంతాన్ని చూపుతున్న రైతులు

- రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయి ఏడాది
- తాత్కాలిక మరమ్మతులతోనే సరి..
- నిధులు మంజూరు చేయని సర్కారు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వస్తుండడంతో ఈ రిజర్వాయర్ జలకళను సంతరించుకుంటోంది. అయితే గతేడాది కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది కురిసిన భారీ వర్షాలకు సింగితం రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. ఎగువ నుంచి వచ్చిన వరదలతో సింగితం రిజర్వాయర్ అలుగు దూకింది. అయితే బుంగల కారణంగా రిటెయినింగ్ వాల్ పటుత్వాన్ని కోల్పోయి వరద తాకిడికి కొట్టుకుపోయింది. దీంతో వరద నీరు వృథా అయ్యింది. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 8 లక్షలు మంజూరు కావడంతో నీటిపారుదలశాఖ అధికారులు ఇసుక బస్తాలను అడ్డువేసి నీటి వృథాను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అనంతరం శాశ్వత మరమ్మతుల కోసం నీటి పారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి రూ. 1.8 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులు చేపట్టలేకపోయారు.

పంటలు గట్టెక్కేదెట్లా..

ఇటీవల కురిసిన వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 416.55 మీటర్లు కాగా.. ప్రస్తుతం 415.3 మీటర్ల నీరు నిల్వ ఉంది. అయితే వర్షాలు కురిస్తే అదనంగా వచ్చే వరద నీరు నిలిచే అవకాశం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వరదలు వస్తే ఇసుక బస్తాలు కొట్టుకుపోయి ఉన్న నీరు ఖాళీ అయ్యే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. రిజర్వాయర్ కింద నర్వ, మహమ్మద్‌నగర్, గున్కుల్ గ్రామాల పరిధిలో 456 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ వద్ద వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతే ఆయకట్టు పంటలు గట్టెక్కడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నీరు నిలిచేలా చూడాలి



బుంగలతోపాటు కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో అలుగు పరిస్థితి అధ్వానంగా ఉంది. భారీ వానలు పడితే రిటెయినింగ్ వాల్‌కు అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతాయి. దీంతో ఆయకట్టుకు నీరందదు. వెంటనే తగిన మరమ్మతులు చేపట్టి నీరు నిలిచేలా చూడాలి.
– మల్లేశ్ యాదవ్, ఆయకట్టు రైతు, నర్వ

సిమెంట్ పనులు చేపట్టాలి



గతేడాది వానాకాలంలో కురిసిన భారీ వర్షాలతో రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయింది. ఏడాది కావస్తున్నా ఇప్పటిదాకా సిమెంట్ పనులు చేయలేదు. వానలు కొడుతుండడంతో రిజర్వాయర్ నిండుతోంది. వరదలు వస్తే రిజర్వాయర్ కొట్టుకుపోవడం ఖాయం. వెంటనే రిటెయినింగ్‌వాల్‌కు సిమెంట్ పనులు చేపట్టాలి.
– కొండపురం వెంకటి, ఆయకట్టు రైతు, నర్వ

అటెన్షన్ ప్లీజ్

పగులగొట్టి.. అలాగే వదిలేసి..

కామారెడ్డి పట్టణంలోని పాత ఎన్‌హెచ్–7 పై రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించి స్లాబ్ వేశారు. అయితే కొత్త బస్టాండ్ ప్రాంతంలో హోటళ్లు ఎక్కువగా ఉండడంతో వ్యర్థాల వల్ల డ్రెయినేజీ తరచూ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల మున్సిపల్ అధికారులు డ్రెయినేజీపై ఉన్న స్లాబ్‌ను పలు చోట్ల పగుల గొట్టించారు. పేరుకుపోయిన చెత్తను తీయడానికి అనుకూలంగా గుంతలు చేశారు. అయితే వాటికి పైకప్పులు చేయించలేదు. దీంతో డ్రెయినేజీ నుంచి వస్తున్న దుర్వాసనతో దుకాణాల యజమానులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్లాబ్ పగులగొట్టిన చోట ప్రమాదకరంగా మారాయి. ఆదమరిస్తే అందులో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరగకముందే పగులగొట్టిన చోట పైకప్పులు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



కొత్తబస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ స్లాబ్‌ను పగులగొట్టడంతో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

- పోలీసు కేసులకు భయపడొద్దు
- ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

కామారెడ్డి అర్బన్: ఆర్‌ఎంపీలు, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయవద్దని వారి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు హన్మంతరావు కోరారు. బుధవారం దేవునిపల్లిలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇప్పించి గుర్తింపు ఇచ్చారని, ఇప్పటి పాలకులు బోగస్ వైద్యులంటు పోలీసు కేసుల పేరిట వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉండాలని, పోలీసులు కేసులు పెట్టినా భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికి 438 కేసులు నమోదు చేశారని, అవి కోర్టుల్లో వీగిపోతున్నాయని తెలిపారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల వృత్తి భద్రత కోసం న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, అంజిరెడ్డి, బుచ్చిరెడ్డి, గంగాధర్ తదితరులు మాట్లాడారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

జిల్లా కార్యవర్గం..

ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిజ్జన విఠల్ (లింగంపేట), గౌరవ అధ్యక్షుడిగా పోలీసు రాజేశ్వరరావు(తాడ్వాయి), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎస్.గోపాల్‌రావు(తాడ్వాయి), ప్రధాన కార్యదర్శిగా దాసరి మాణిక్యం (బాన్సువాడ), కోశాధికారిగా రవి (బీబీపేట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- మద్నూర్ వైద్యులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచన
- రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా

మద్నూర్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఫార్మసిస్టుతో మాట్లాడి మందుల గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో భోజనం మాత్రమే పెడుతున్నారని, బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడం లేదని రోగులు కలెక్టర్‌తో పేర్కొన్నారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

కలెక్టర్ వస్తున్నారని తెలిసి..

కలెక్టర్ సంగ్వాన్ ఆస్పత్రి సందర్శనకు వస్తున్నారన్న సమాచారం ముందుగానే తెలియడంతో వైద్యులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆస్పత్రిని పూర్తిగా పరిశుభ్రంగా ఉంచారు. పూర్తి స్థాయిలో అందరు వైద్యులు డ్యూటీలో ఉండడం గమనార్హం.



మద్నూర్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి

ఇలాగేనా వైద్యం చేసేది?

ఓపీ వద్ద రోగులు కుర్చుండే బెంచీపై రోగికి సిబ్బంది వైద్యం చేయడాన్ని గమనించి కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్‌ను పిలిచి రోగులకు వైద్యం చేసేది ఇలాగేనా అని ప్రశ్నించారు. బెడ్‌పై పడుకోబెట్టి వైద్యం అందించాలని ఆదేశించారు.



బెంచీపై పడుకోబెట్టి వైద్యం చేస్తుండడాన్ని గమనిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

బాలికల గురుకులం సందర్శన..

పెద్ద ఎక్లార గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్, సబ్‌కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పెద్దయ్యాక ఏం అవుతారని అడగ్గా.. ఒకరు కలెక్టర్ అని, కొందరు లాయర్, ఐపీఎస్ అవుతామని చెప్పారు. కష్టపడి చదివితేనే లక్ష్యాన్ని చేరుకోగలమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలో సమస్యల పరిష్కారం కోసం రూ. 2 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించాలని, హాస్టల్ గేటు వద్ద సెక్యూరిటీ గార్డు కోసం గది నిర్మించాలని సూచించారు. అనంతరం ఆయన హండేకేలూర్ వెళ్లి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా పైఅధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మద్నూర్ శివారులోని సోనాల రోడ్డులో భూభారతి దరఖాస్తుపై క్షేత్ర స్థాయిలో విచారించారు. కార్యక్రమాలలో డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, తహసీల్దార్ ముజీబ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లకు 'ఇసుక' అనుమతి ఇవ్వాలి

● బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి



బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక కావాలని వచ్చిన లబ్ధిదారులకు వెంటనే అనుమతి పత్రం అందించి.. ఇసుక చవకగా అందే విధంగా చూడాలని తహసీల్దార్ వేణుగోపాల్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. మండల తహసీల్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి రికార్డులు పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. భూభారతి రికార్డుల్లో తప్పులు లేకుండా చూడాలని, రైతుల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు.

వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం తగదు



బాన్సువాడ రూరల్: చిన్నారులకు వ్యాక్సినేషన్ ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి విద్య అన్నారు. బుధవారం ఆమె బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్న పిల్లలకు వ్యాక్సిన్లు సమయానుసారం వేయించడం తప్పనిసరని, వ్యాక్సిన్ల ప్రాముఖ్యతను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో వ్యాక్సినేషన్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌వో దయానంద్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు డిమాండు చేశారు. ఈ సందర్భంగా బుధవారం పార్టీ నాయకులు తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రావు, ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్ శర్మ, నాయకులు కృష్ణ, నాన్యనాయక్, సాయిలు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట గ్రామానికి చెందిన సొసైటీ మాజీ డైరెక్టర్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు ఆకారం హన్మండ్లు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు సక్రమంగా అమలు చేశాడని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా చేయడం లేదని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, నాయకులు సాయాగౌడ్, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ డిక్లరేషన్ అమలేదీ?

● డిక్లరేషన్ వదిలేసి ఇమామ్‌లు, మౌజమ్‌ల గౌరవ వేతనాల విషయంలో కొర్రీలు
● దరఖాస్తులకు పరిమిత గడువుతో సమస్యలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మైనారిటీల అభ్యున్నతి కోసం రూ.4 వేల కోట్లు కేటాయించి, ప్రత్యేకంగా ఉప ప్రణాళిక అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ దాన్ని మరచిందని మైనారిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాదిన్నర దాటినప్పటికీ దీని ఊసేలేదని, గత ఎన్నికల్లో పేరుకే మైనారిటీ డిక్లరేషన్ ప్రకటించారని అంటున్నారు. ఇదిలా ఉండగా కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ వేతనం చెల్లించే విషయంలోనూ ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు, మౌజమ్‌లకు గత ప్రభుత్వం నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తూ వచ్చింది. ఇలా పనిచేసే వారిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు సైతం ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,200 మంది ఇమామ్‌లు, మౌజమ్‌లు ఉన్నారు. ఈ ఏడాది ఈ గౌరవ వేతనాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం హైదరాబాద్‌లోని ఓ స్థానిక ఉర్దూ పత్రికలో ప్రకటన ఇచ్చింది. మసీదు ధ్రువీకరణ పత్రంతోపాటు గతంలో లేనివిధంగా పాన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం సైతం జత చేయాలని నిబంధనలు పెట్టింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇన్‌కం సర్టిఫికెట్లు తెచ్చుకోలేకపోతున్నారు. అలాగే గడువు సైతం జూలై 31 వరకే ఇవ్వడంతో అత్యధిక మంది ఇమామ్‌లు, మౌజమ్‌లు దరఖాస్తులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో గడువు పొడిగించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇమామ్‌లకు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.12 వేలకు పెంచుతామని ప్రకటించింది. అయితే ఇచ్చిన హామీ మేరకు పెంచకపోగా ఇలా కఠిన నిబంధనలు పెట్టడమేమిటని పలువురు అంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఇలాంటి నిబంధనలు లేవని, పైగా ప్రస్తుతం నెలనెలా చెల్లింపులు చేయకుండా మూడునెలలకోసారి చెల్లిస్తున్నారని చెబుతున్నారు.



కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్

కోత పెట్టేందుకే కఠిన నిబంధనలు..



ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇస్తున్న గౌరవ వేతనాల్లో కోత పెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది. ఎన్నికల హామీ మేరకు గౌరవ వేతనాలు పెంచకపోగా కావాలనే కఠిన నిబంధనలు రూపొందించారు. ప్రభుత్వం గడువును మరో నెలరోజులు పొడిగించాలి. మూడు నెలలకొకసారి ఇస్తున్న గౌరవ వేతనాలను గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా నెలనెలా ఇవ్వాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే నిబంధన సరికాదు.

– యాకూబ్‌పాషా, రాష్ట్ర అధ్యక్షుడు, మైనారిటీ సంక్షేమ సంఘం

ప్రతిపాదనలు పంపాం..

నిబంధనల్లో మార్పులు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. దరఖాస్తుల గడువు పెంచే విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం.

– అసదుల్లా, సీఈవో, రాష్ట్ర వక్ఫ్ బోర్డు

'మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చందర్

కామారెడ్డి అర్బన్: మహిళలు ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలు(ఎంఎస్ఎంఈ) ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. జిల్లాలోని స్వయంసహాయ సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికత్తలకు బుధవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. కొత్తగా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించిన మహిళలకు రెండేళ్ల పాటు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. వస్త్ర పరిశ్రమలు, ఆహార ఉత్పత్తులు, హస్తకళలకు వీ హబ్ ద్వారా ఆదాయం పెంచుకోవడానికి నైపుణ్య శిక్షణ, నిపుణుల సలహాలు, ప్రోత్సాహం అందించనున్నట్టు వీ హబ్ డైరెక్టర్ జాహీద్ షేక్ అన్నారు. వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ, డీఆర్‌డీవో ఎం.సురేందర్, జిల్లా పరిశ్రమల అధికారి లాలు నాయక్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న పశ్య పద్మ

బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. బుధవారం బాన్సువాడలో నిర్వహించిన సీపీఐ 4వ మండల మహాసభలకు ఆమె హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలను బడా బాబులకు అనుకూలంగా సవరణ చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతూ జీవో తీసుకురావడం శోచనీయమని అన్నారు. దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు దుబాస్ రాములు, దశరథ్, శంకర్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, సర్దార్, శివాజీ, రాజు, భూమయ్య, తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



ప్రయాణికురాలికి బ్యాగును అప్పగిస్తున్న కండక్టర్ సువర్ణ

కామారెడ్డి క్రైం: బస్సులో మరిచిపోయిన బ్యాగును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించి కామారెడ్డి డిపోకు చెందిన కండక్టర్ సువర్ణ తన నిజాయితీని చాటుకున్నారు. ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. డిపోకు చెందిన బస్సు సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌కు వెళ్లింది. అందులో ఎక్కిన ఓ మహిళా ప్రయాణికురాలు తన బ్యాగును బస్సులో మర్చిపోయి జేబీఎస్‌లో దిగిపోయింది. బ్యాగును గమనించిన కండక్టర్ సువర్ణ తన వద్ద భద్రపరిచారు. కొద్దిసేపటి తర్వాత ప్రయాణికురాలు తన బ్యాగు కనిపించడం లేదంటూ తిరిగి బస్టాండ్‌కు వచ్చింది. అక్కడే ఉన్న కండక్టర్ ప్రయాణికురాలికి బ్యాగును అప్పగించింది. కాగా, బ్యాగులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌తోపాటు కొంత నగదు ఉంది. పోయిందనుకున్న బ్యాగు తిరిగి దొరకడంతో ప్రయాణికురాలు కండక్టర్ సువర్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడే ఉన్న కొందరు ప్రయాణికులు నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను అభినందించారు.

అభివృద్ధి పనులకు అధిక నిధులు



వర్ని (మోస్రా): ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలో నిర్మిస్తున్న మండల సముదాయ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. వచ్చే నెల 4న మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో మండల సముదాయ భవనాలు, జనరల్ ఫంక్షన్ హాల్, గ్రామ పంచాయతీ భవనాలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వనమహోత్సవంలో విద్యార్థులు



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో సురేందర్, అధికారులు, ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద శివారులో గల బృహత్ పల్లె ప్రకృతివనంలో బుధవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ పాఠశాల విద్యార్థులతో కలిసి వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కేరళ స్కూల్‌కు చెందిన విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. జీపీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్‌అసిస్టెంట్ సాయిలు, వనసేవకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మధ్యాహ్న భోజనానికి సంబంధించి 2025– 26 సంవత్సర రెగ్యులర్ బిల్లులు కోసం నిధులు విడుదల చేసినట్లు డీఈవో అశోక్ తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు కుకింగ్ నిధులు రూ.2 కోట్ల 15 లక్షల 328, సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.48 లక్షలు రిలీజ్ చేశామన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో డాగ్‌స్క్వాడ్‌తో బుధవారం తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను సేకరించామన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బ్యాగులు, మూటలు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ప్రయాణికులకు సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై హబీబ్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భర్త హత్యకు సుపారీ ఇచ్చిన భార్య

● వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్లాన్
● ప్రియుడితో కలిసి కుట్ర పన్నిన భార్య
● తీవ్రగాయాలతో తప్పించుకున్న భర్త



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, పక్కన సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై భార్గవ్‌గౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసేందుకు కుట్ర పన్నిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు కేసు వివరాలను వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలంలోని చిన్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన పల్లె సంపూర్ణకు అదే గ్రామానికి చెందిన జాన్సన్‌తో వివాహేతర సంబంధం ఉంది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్త పల్లె రవిని అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నింది. రవిని హత్య చేసిన వారికి రూ.లక్ష నగదు సుపారీగా ఇవ్వాలని జాన్సన్‌కు చెప్పింది. దీంతో జాన్సన్ తన స్నేహితులైన చాకలి రాజు, నవీన్, మరో 17ఏళ్ల బాలుడిని సంప్రదించాడు. అందులో భాగంగా పల్లె రవికి డబ్బులు అప్పుగా ఇస్తామని నమ్మించి ఈ నెల 24న చిన్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన జాన్సన్, చాకలి రాజు, తాండూర్‌కు చెందిన నవీన్‌‌తోపాటు మరో మైనర్ ఎల్లారెడ్డి మండలం పెద్దారెడ్డి గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లి మద్యం సేవించారు. అదే సమయంలో జాన్సన్‌తోపాటు చాకలి రాజు సుత్తితో రవి తలపై దాడి చేశారు. దీంతో రవి వారి నుంచి తప్పించుకొని సమీపంలోని ఫామ్‌హౌస్‌లోకి పరుగెత్తాడు. అయినా జాన్సన్, చాకలి రాజు వెంబడించి రవిపై మరోసారి దాడి చేసినా రవి మళ్లీ తప్పించుకొని ప్రాణాలను కాపాడుకున్నాడు. కాగా, పల్లె సంపూర్ణ తన భర్తపై జాన్సన్, చాకలి రాజుతోపాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్సై భార్గవ్‌గౌడ్ దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. సంపూర్ణనే భర్తను హత్య చేయించేందుకు కుట్ర పన్నిందని తెలుసుకున్న పోలీసులు దాడి కేసును హత్యాయత్నంగా మార్చి విచారణ చేపట్టారు. నిందితులు పల్లె సంపూర్ణతోపాటు జాన్సన్, చాకలి రాజు, నవీన్, ఓ మైనర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలతోపాటు మూడు మొబైల్ ఫోన్లు, సుత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కేసును ఛేదించిన ఎస్సైతోపాటు హెడ్ కానిస్టేబుల్ మనోహర్ రావు, కానిస్టేబుళ్లు గంగారాం, సందీప్, అన్వరీని ఎస్పీ రాజేశ్‌చంద్ర ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త రకం సోయా పంట పరిశీలన



మేనూర్ శివారులో సోయా పంటను పరిశీలిస్తున్న డీఏవో, వ్యవసాయ శాఖ అధికారులు

మద్నూర్(జుక్కల్): మేనూర్ శివారులోని కొత్త రకం సోయాబీన్ పంటను బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) మోహన్‌రెడ్డి పరిశీలించారు. నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్ పథకం కింద ఎఫ్‌పీవో ద్వారా రైతులకు వానాకాలం సాగు కోసం సోయాబీన్ విత్తనాలను అందించామని, అవి ప్రస్తుతం ఎలా ఉన్నాయో ఆయన రైతులను అడిగి తెలుసుకున్నామని డీఏవో అన్నారు. రైతులకు డీఎస్‌బీ-34 రకం సోయాబీన్ విత్తనాలు ఇచ్చినట్లు వెల్లడించారు.కొత్త రకం సోయాబీన్ పంట ఎదుగుదల బాగుందని అన్నారు. ఈ విత్తనాలు వేసిన రైతులకు వ్యవసాయ, శాస్త్రవేత్తలతో శిక్షణ ఉంటుందని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఏవో రాజు, జిల్లా టెక్నికల్ ఏవో సంతోష్ కుమార్, మేనూర్ ఏఈవో విశాల్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, ఎఫ్‌పీవో చైర్మన్ గోపాల్, రైతులు పాల్గొన్నారు.

ఈ– పాస్ ద్వారానే యూరియా అమ్మాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఫెర్టిలైజర్ దుకాణాలలో రైతులకు ఈ– పాస్ ద్వారానే యూరియాను విక్రయించాలని దుకాణ యజమానులకు డీఏవో మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని దుకాణాలు, గోదాములను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ..రైతులకు ఒరిజినల్ బిల్లులను ఇవ్వాలని సూచించారు. ప్రతి షాపులో స్టాక్ బోర్డు తప్పకుండా ఉండాలని సూచించారు. స్టాక్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఒరిజినల్ బిల్లులు ఇవ్వలేదని మా దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఏవో కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్లు మాయం



చిందర వందరగా సీపీయూ బాక్సులు

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ జెడ్పీ హైస్కూల్ నుంచి నాలుగు కంప్యూటర్లు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ అప్పా తెలిపారు. ప్రభుత్వం 10 కంప్యూటర్లు మంజూరు చేయగా, వాటిలో ఐదింటిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఇచ్చి ఒక కంప్యూటర్‌ను కార్యాలయ నిర్వహణకు ఉపయోగిస్తున్నామన్నారు. వేసిన తాళం వేసినట్లుగా ఉందని, కంప్యూటర్లు మాత్రం కన్పించకుండా పోయాయని అన్నారు. ఈ నెల 22న చోరీ జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతోపాటు బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కాగా, విషయాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వారం రోజులుగా గోప్యంగా ఉంచడంపై సిబ్బందిపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హమాలీలు కాదు.. ఆరోగ్య శాఖ సిబ్బందే..!



ఆటో నుంచి బెడ్‌లను దింపుతున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు

నస్రుల్లాబాద్: పై చిత్రంలో ఆటోలో నుంచి సామాను తీస్తూ కనపడుతున్న మహిళలు హమాలీ పనులకు వచ్చిన వారు కాదు.. నస్రుల్లాబాద్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పిట్లం నుంచి వచ్చిన మంచాలు, బెడ్లు, కుర్చీలను ఆటో నుంచి దింపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కొంత కాలం సబ్ సెంటర్ నిర్వహిస్తామనడం.. ఉన్నపలంగా సామగ్రి రావడంతో సహాయకులు ఎవ్వరూ దొరక్కపోవడంతో ఇలా వారే మోయలేని బరువులను మోస్తూ కనబడ్డారు. నూతన భవనం ప్రారంభించడం కాదని కనీసం వస్తువులు దింపడానికి కూలీలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారులు మరిచారని ఆరోగ్య శాఖా మహిళా సిబ్బంది తిప్పలు చూస్తున్న స్థానిక ప్రజలు అంటున్నారు.

కూలిన పంట కాలువ గోడ



మైలారంలో కూలిన పంట కాలువ గోడ

నస్రుల్లాబాద్: మైలారంలో పంట కాలువ గోడ శిథిలావస్థకు చేరి కూలిపోయింది. నిజాంసాగర్ ప్రధాన కాలువ నుంచి వచ్చే 25వ నెంబర్ ఉప కాల్వ కింద ఉన్న 4వ నెంబరు పిల్ల కాలువ గోడ వర్షానికి కూలి కాలువలో పడింది. దీనితో పంట పొలాలకు నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. త్వరగా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం'



ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో దశ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు చకినాల అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో మలిదశ పోరాటం చేపట్టనున్నామని అన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రాలలో ఆగస్టు 5న ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, వాటిని నిరోధించేందుకు ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ హాల్‌లో బుధవారం సైబర్ వారియర్స్‌కి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఫిషింగ్, వేరియంట్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా మోసాలుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కేసును సీరియస్‌గా తీసుకొని బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో 1 జనవరి 2024 నుంచి జూలై 29, 2025 వరకు మొత్తం 759 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా రూ.3,27,12,397.84 కోర్టు ద్వారా బాధితులకు అందించామన్నారు. అనంతరం సైబర్ వారియర్స్‌కు టీ షర్ట్స్ అందజేశారు.

ప్రభుత్వ కళాశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ పేర్కొన్నారు. డీఐఈవో కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలుకు విద్యార్థుల బయోడేటా, ఆధార్‌ను ఇంటర్ బోర్డు లాగిన్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. అపార్ నెంబర్ గుర్తింపుతోపాటు యుడైస్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు సమయపాలన పాటించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటర్ బోర్డు సూచించిన సెంట్రలైజ్డ్ టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని తెలిపారు. అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, పేరెంట్స్ మీటింగ్‌లు నిర్వహించాలని పేర్కొన్నారు.